క్లుప్తంగా

వేతనాల చెల్లింపులో జాప్యం



వైద్యాధికారికి వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు, నాయకులు

పెనుగొండ: స్థానిక పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ నిధులు, వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ తాత్సారం చేస్తున్నారని సీఐటీయూ నాయకుడు షేక్ పాదుషా ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.చంద్ర సవేరికి వినతి పత్రం అందజేశారు. 2024 మార్చి నుంచి వేతనాలు చెల్లించడంలేదని, వేతనాలు, పీఎఫ్ నిధులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిభారం పెరిగిందని, అధనంగా కార్మికులను నియమించాలని పేర్కొన్నారు .నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ



తూర్పుతాళ్లులో మైక్‌సెట్ అందిస్తున్న దాతలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం తూర్పుతాళ్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ దండు మారెమ్మ, పేట మారెమ్మ అమ్మవార్ల ఆలయానికి దాతలు మైక్‌సెట్‌ను బహూకరించారు. మంగళవారం గ్రామానికి చెందిన ఈవన ఆంజనేయులు, కటకట్ల వెంకట ఆదిత్య, ఈవనవ జయరాజులు ఆలయ నిర్వాహణ కమిటీకి ఈ మైక్‌సెట్‌ను అందజేశారు. దాతలను పలువురు భక్తులు అభినందించారు.

రక్తదానంపై అవగాహన అవసరం



రక్తదానం చేసిన ఉపాధ్యాయులు

నరసాపురం: రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. నరసాపురం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులో గౌతమి ల్యాబ్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని ఉపాధ్యాయులు, ఎంపీడీఓ త్రిశూలపాణితో పాటు మొత్తం 30 మంది రక్తదానం చేశారు. నరసాపురం రెడ్‌క్రాస్ ప్రతినిధి ఎనుముల సతీష్ ఆధ్వర్యంలో రక్త సేకరణ చేశారు. డీఈఓ నారాయణ, ఎంఈఓ పుష్పరాజ్యం పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగిస్తాం



వంతులవారీ విధానాన్ని పరిశీలిస్తున్న మార్రాజు, తదితరులు

నరసాపురం రూరల్: రామన్నపాలెం బ్రాంచ్ లక్ష్మణేశ్వరం చానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగిస్తామని నీటి సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మార్రాజు అన్నారు. మంగళవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి వంతులవారీ విధానం అమలు తీరును పరిశీలించారు. యర్రంశెట్టివారిపాలెంలో రైతులతో మాట్లాడారు. రామన్నపాలెం బ్రాంచ్ లక్ష్మణేశ్వరం కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. రైతులు, రైతు నాయకులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బాబులు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడు కంచర్ల కన్నుమూత



రాజగోపాలరావు (ఫైల్)

నరసాపురం రూరల్: నరసాపురం మండలం తూర్పుతాళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు కంచర్ల రాజగోపాలరావు (90) మంగళవారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదారాజు, బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకీరామ్, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ తదితర ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

తడారుతున్న వరి చేలు



ఇలపర్రు శివారు తడారుతున్న వరి చేలు



నిర్వహణా లోపంతో కోడేరు బ్యాంక్ కెనాల్ దుస్థితి

- ఆదిలోనే నీటి కష్టాలు
- తీవ్రమవుతున్న ఎండలు
- ఆందోళనలో రైతులు

పెనుగొండ: దాళ్వా సాగుకు ఆదిలోనే నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండడంతో వరిచేలు తడారిపోతున్నాయి. కోడేరు బ్యాంకు కెనాల్ పరిధిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శివారు ప్రాంత చేలకు అందని నీరు

కోడేరు బ్యాంక్ కెనాల్‌లో సిద్ధాంతం ఎగువ నుంచి ఆచంట చానల్, చినమల్లం, తామరాడ ప్రాంతాలకు పంట కాల్వలు ఉన్నాయి. వీటి శివారు ప్రాంత చేలకు నీరు అందడంలేదు. పెనుగొండ మండలం ఇలపర్రు, తామరాడ, వడలిలోని శివారు ప్రాంతాలతో పాటు ఆచంట మండలం ఆచంట వేమవరం, పెనుమంచిలి, వల్లూరు, కొడమంచిలి, కోడేరు, భీమలాపురం, శేషమ్మ చెరువుల్లోని వరి చేలకు సరైన స్థాయిలో నీరు పారడంలేదు. కొన్ని గ్రామాల్లో కాల్వల్లో ఇంజిన్లు వేసి నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో ప్రతి ఐదు రోజులకు ఒకసారి వంతుల వారీ విధానంలో వరి చేలకు నీరు సరఫరా చేస్తున్నారు. ఎండల తీవ్రతకు త్వరగా నీరు ఆవిరై వరిచేలు తడారి పోతున్నాయి. చేలల్లో వరి దుబ్బు చేసేదశలో ఉంది. ఈ తరుణంలో నీరు అధికంగా ఉండాలి. నీటి ఎద్దడితో వరి దుబ్బు చేయకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెబుతున్నారు. కోడేరు బ్యాంక్ కెనాల్ నిర్వహణా లోపం వల్లే రైతులు నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కెనాల్‌లో కర్రనాచు పెరిగి పంట కాల్వలోకి నీరు రావడంలేదు. పంట బోదెల నిర్వహణ గాలికొదిలేయడంతో ఆదిలోనే నీటి ఇబ్బందులు పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలంటూ వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిర్వహణా లోపం వల్లే



పంట కాల్వల నిర్వహణా లోపంతోనే వరిచేలకు నీరు అందడం లేదు. దీనిపై ఎన్నో సార్లు విన్నవించుకొన్నా పట్టించుకొనే నాథుడులేడు. ఇది రైతుల పాలిట శాపంగా మారింది. వేసవి ప్రారంభం కాకుండానే నీటి ఎద్దడి ఏర్పడింది. రానున్న రోజుల్లో మరిన్ని కష్టాలు పడాల్సి వస్తుంది. అధికారులు సత్వరం చర్యలు తీసుకొని సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– షేక్ పాదుషా, నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఆదేశించారు. చెత్త సేకరణపై మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్త సేకరణలో లోపాలు సరిదిద్దాలన్నారు. క్లీన్ పట్టణంగా అభివృద్ధి చేసే అంశంలో ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, శానిటరీ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి నైపుణ్యాభివృద్ధిపై సదస్సు

పెనుగొండ: నైపుణ్యాభివృద్ధిపై బుధవారం నుంచి ఐదు రోజుల పాటు స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) న్యూఢిల్లీ సౌజన్యంతో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, ఎస్వీకేపీ కళాశాల సంయుక్తంగా సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యా సంస్థలకు నాక్, ఎన్ఐఆర్ఎఫ్‌లలో ఉన్నత ప్రమాణాలను పెంచి మూడేళ్లపాటు ఎన్నో ప్రయోజనాలు అందించాలన్నదే సదస్సు లక్ష్యమని వివరించారు. సదస్సు తొలిరోజు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఉప కులపతి వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రారు జి.సుధాకర్, మార్గదర్శి స్కీం ముఖ్యసమన్వయ కర్త పి.వెంకటేశ్వరరావు, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు టి.నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ పాల్గొంటారని తెలిపారు.

బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు



పాడైన రోడ్డు వద్ద రాళ్లు పేర్చుకుంటున్న వ్యాపారులు

నరసాపురం: పట్టణంలోని ప్రధాన ప్రాంతం బస్టాండ్ పక్కరోడ్డు గుంతలు పడి ప్రమాద ఘంటికలు మోగిస్తుంది. అనేక వ్యాపార సముదాయాలు ఉండే ఈ ప్రాంతంలో మోటార్ సైకిళ్లపై వెళ్లేవారు జారిపడుతున్నారు. అటు బస్టాండ్ పక్క నుంచి 216 జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డులో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో స్థానిక వ్యాపారులు అక్కడక్కడ రాళ్లు పోగుచేసుకుని గోతులను పూడ్చుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రైతుసేవాకేంద్రాన్ని సందర్శిస్తున్న ఏఓ సత్యనారాయణ

పోడూరు: భూమి ఉన్న రైతులంతా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. కొమ్ముచిక్కాల రైతు సేవాకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రైతు నమోదు ప్రక్రియకు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు అందజేయాలని సూచించారు. పట్టాదారుపాస్ పుస్తకం లేదా 1బి, ఆధార్, ఆధార్ కార్డ్ లింక్ అయిన సెల్ నెంబర్ సిబ్బందికి అందజేయాలన్నారు. వ్యవసాయరంగాన్ని డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ సంఖ్య ఆధారంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, విత్తనాలు, యంత్ర పరికరాలు తదితర ప్రయోజనాలు అందుతాయని వివరించారు.

ఆక్వా రైతులు నిబంధనలు పాటించాలి



మురుగు కాలువ గట్టును తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ల: ఆక్వా చెరువుల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్రైనేజీ ఏఈ జయప్రకాష్, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఇందిరాప్రియదర్శిని హెచ్చరించారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామం పరిధిలో బొండాడ మురుగు డ్రైయిన్ గట్టును ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువులను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. బొండాడ మురుగు డ్రైయిన్ ఆనుకుని ఉన్న ఆక్వా చెరువుల రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి వచ్చామన్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువగట్టు ఆక్రమించి తవ్వటమే కాకుండా మట్టిని సైతం తరలించినట్లు వారు గుర్తించామన్నారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలువగట్టుకు మూడు మీటర్లు వదిలి చెరువుకు గట్టు వేసుకోవాలని మురుగు కాలువ గట్టునే ఆక్రమించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా సరిహద్దు రాళ్లను సైతం మార్చి మురుగు కాలువ గట్టుపై పాతడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన రైతుకు నోటీసులు జారీ చేస్తామని, అప్పటి వరకు చెరువులో నీరు నింపకూడదని, ఒక వేళ తాము అందించిన నోటీసులను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో హుస్సేన్, డ్రైనేజీ, మత్స్యశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు యూనిఫాం అందజేత



ఎన్‌సీసీ మహిళా క్యాడెట్లకు యూనిఫాం అందిస్తున్న దృశ్యం

పోడూరు: పాలకొల్లు వాకర్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ నావల్ విభాగంలో చేరిన 30 మంది మహిళా క్యాడెట్లకు పాలకొల్లు వాకర్స్ క్లబ్ ద్వారా రూ.15 వేల విలువైన ఏకరూప దుస్తులను మంగళవారం క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అందజేశారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, కోశాధికారి ఉద్దగిరి లవ కుమార్, ప్రధానాచార్యుడు వైవీవీ అప్పారావు, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, నావల్ ఆఫీసర్ కాపా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో సర్పంచ్ లావణ్య



ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న సర్పంచ్ లావణ్య

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సారవ గ్రామ సర్పంచ్ కైల లావణ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందించారు. ఆమె, ఆమె భర్త సతీష్ గతంలో వైఎస్సార్ సీపీలో చురుగ్గా పనిచేశారు. ఈ సందర్భంగా లావణ్య సాక్షితో మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఉన్నత విద్యావంతురాలిగా వెనుక బడిన వర్గాలకు చెందిన మహిళగా గ్రామ సర్పంచ్‌గా సమర్థవంతంగా పని చేస్తున్నానని చెప్పారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని లావణ్యా సతీష్ కోరారు.

సనాతన ధర్మాన్ని పాటిద్దాం



దొడ్డిపట్లలో పర్యటించిన ముద్దు సాయిరాం

యలమంచిలి: ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతంగా జీవించాలంటే సనాతన ధర్మాన్ని పాటించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. సనాతన ధర్మంలో మనుషుల జీవనయానం సవివరంగా ఉంటుందన్నారు. హైందవ శంఖారావ సభ విజయవంతమైన నేపథ్యంలో జిల్లాలోని పలు మండలాల్లో ఆయన కృతజ్ఞత యాత్ర చేస్తూ మంగళవారం యలమంచిలి మండలంలో పర్యటించారు. హిందూ బంధువులను కలుసుకుని ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానవుల జీవితానికి సార్థకత చేకూరుతుందని వివరించారు. ఆయన వెంట జిల్లా ధర్మ ప్రచారక్ మన్నే కుమారస్వామి, జిల్లా పర్యోజన ప్రముక్ చెల్లుబోయిన మురళీకృష్ణ, మండల ప్రముక్‌లు చిలుకూరి ఆంజనేయులు, తాళ్లూరి సత్య శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

భీమవరం అర్బన్: ఈ నెల 14న భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మురళీ గంగాధరరావు మంగళవారం తెలిపారు. సమావేశం ఉదయం 11.30లకు ప్రారంభమవుతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరై అజెండాలోని అంశాలపై చర్చిస్తామని వివరించారు.

విద్యుత్ మీటర్ల బిగింపు



దళితులతో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్

ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని మంచి నీటి చెరువు గట్టు వద్ద ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న దళితుల ఇళ్లు తొలగిస్తూ, విద్యుత్ మీటర్లు తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. పోరాటాల ఫలితంగా దళితుల ఇళ్ల తొలగింపును కోర్టు నిలుపుదల చేసిందని, వెంటనే ఆయా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించడంతో మంగళవారం కనెక్షన్లు ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆక్రమణదారులకు అండగా నిలిచి, అధికారుల చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. పుష్పరాజ్ మాట్లాడుతూ అధికారులు దళితులపై దాడులు ఆపి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, నల్లి రాజేష్, జిల్లా కార్యదర్శి గడ్డం అబ్రహం, చిల్లి రాజ్‌కుమార్, కేదాస్ నాగరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

12 నుంచి బధిరుల టీ20 క్రికెట్ పోటీలు



భీమవరంలో క్రికెట్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించే 5వ రాష్ట్రస్థాయి మూగ చెముడు (బధిరులు) టీ20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి చెప్పారు. మంగళవారం డీఎన్నార్ కళాశాల వద్ద గన్నాబత్తులవారి క్రీడమైదానంలో క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కకకృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్స్‌తో క్రీడాకారులు, నాలుగు జోన్ జట్లుగా పోటీల్లో తలబడుతున్నారన్నారు. పోటీలను బుధవారం ఉదయం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభిస్తారని భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య, డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తదితరులు పాల్గొంటారని తెలిపారు.

విజయలక్ష్మిగా మావుళ్లమ్మ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని విజయలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంగారం సమర్పణ

భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారికి సూళ్లురుపేటకు చెందిన ఐ.చంద్రమతి దంపతులు 15 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదు అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం: కాలుష్య కారణమైన ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలంతా సహకరించాలని భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య అన్నారు. మంగళవారం భీమవరం మునిసిపాల్టీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీసూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని వివిధ రకాల వ్యాపారస్తులు ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వినియోగించరాదని నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవన్నారు. కళాశాల కరస్పాండెంట్ నూకల గురునాయుడు, ప్రిన్సిపల్ రూపా సూర్యలక్ష్మి, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంవల్ల ఏర్పడే అనర్థాలు విద్యార్థులు గ్రహించి తద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

‘పది’లమైన ఫలితాలు సాధ్యమేనా?

- పని ఒత్తిడిలో ఉపాధ్యాయులు చిత్తు
- పెరిగిన యాప్‌లతో చదవులు అంతంత మాత్రం



పరీక్షలు రాసేందుకు బారులు తీరిన విద్యార్థులు (ఫైల్)

ఉండి : ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నా ముఖ్యంగా ఉపాధ్యాయులు పని ఒత్తిడితో చిత్తవుతున్నారు. విద్యాశాఖలో ఉన్నతాధికారులు తలోమాట తలో ప్రణాళికతో ముందుకు రావడం వాటిని ప్రభుత్వ ఉపాధ్యాయులపై రుద్దడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తమ ప్రణాళికలే పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశాలివ్వడం తనిఖీలు చేయడంతో మరితం ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. మరికొద్ది రోజుల్లోనే పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా ఈ ఏడాది ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఎవరి ప్రణాళిక ప్రకారం జరుగుతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒత్తిడిలో ఉన్నారు.

అధికమైన యాప్‌లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాప్‌లతో ఏగలేకపోతున్నామని వాటిని తీసేయాలని ఆందోళనలు చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు మరింత ఒత్తిడి పెరిగింది. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే యాప్‌లను తొలగిస్తామని హామీలు గుప్పించిన నాయకులు అధికారంలోకి రాగానే యాప్‌ల సంఖ్యను మరింతగా పెంచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడు లేదా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లలో ఉపాధ్యాయులు వివరాలు నమోదు చేసేవారు. కాని ప్రస్తుతం ఆ సంఖ్య ఏడుకు పెరిగింది. దీంతో ఒకవైపు యాప్‌లలో సమాచారం అప్‌లోడ్ చేయలేక మరో వైపు విద్యార్థులకు పాఠశాలు చెప్పలేక ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో గత ఏది పదో తరగతి పరీక్షా ఫలితాల కంటే ఈ ఏడాది ఫలితాలు తగ్గే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అమ్మఒడి ఎగనామం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి రూ.15 వేలతోపాటు పలు పథకాలు, విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా సామగ్రితో కిట్లు అందజేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంత మంది చదువుకునే విద్యార్థులు ఉంటే అందరికీ ఏటా రూ.15 వేల చొప్పున అందజేస్తామని ఊకదంపుడు వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఒడి ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులేదంటూ నిస్సిగ్గుగా ప్రకటించారు. విద్యార్థులకు కావలసిన పౌష్టికాహారం, ప్రత్యేక తరగతులకు ట్రావెలింగ్, స్టడీ మెటీరియల్ వంటివి కొనుగోలు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో విద్యార్థులు ఈ ఏడాది మరింతగా ఇబ్బందుల పాలవుతున్నారు.

అమ్మ ఒడి ఆపడం మోసం



విద్యార్థుల భవితవ్యానికి అమ్మ ఒడి ఎంతో సహకరించేది. ప్రతి ఏటా చెప్పిన సమాయానికి అమ్మ ఒడి నగదు రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి నేరుగా వేసేవారు. కానీ ఇప్పుడు నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని చెప్పి విద్యార్థులను, తల్లిదండ్రులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. దీని వల్ల ఎంతో మంది విద్యార్థులు చదవులో వెనుకబడిపోతున్నారు.

– అంగర రాంబాబు, ఉండి